
రేపు ప్రజాపాలన దినోత్సవం: కలెక్టర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15: ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 17న కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన జాతీయ జెండాను ఎగురవేస్తారని వెల్లడించారు. ప్రభుత్వ సలహాదారు కేశవరావు కార్యక్రమానికి హాజరవుతారని తొలుత ప్రకటించినా, అనివార్య కారణాల వల్ల ఆయన పర్యటన రద్దయిందని తెలిపారు.



అడవి అందాలు.. యోగాసనాలు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న నర్సాపూర్ అడవి అందాలు ఆకట్టుకుంటున్నాయి. ఎటుచూసినా పచ్చదనం పర్చుకున్నట్టు ఉన్న అడవి మధ్యలో ఏర్పాటు చేసిన అర్బన్‌పార్కుకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చారు. పర్యావరణ ప్రాముఖ్యత, యోగా ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు నర్సాపూర్ 'నిత్య జీవన యోగా సాధన సమితి' అధ్యక్షుడు బాచంపల్లి సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సభ్యులు అర్బన్ పార్కులో యోగా శిబిరం నిర్వహించారు. ఎంఈవో బుచ్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్, నాయకులు రాములుయాదవ్, హన్మంతు, సంతోష్, కొండరాములు తదితరులు హాజరై ఆసనాలు వేశారు. జీవనశైలి కారణంగా వచ్చే వ్యాధులను నివారించడానికి యోగా చక్కగా ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలియజేసేందుకే అర్బన్ పార్కులో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు.

-నర్సాపూర్, సెప్టెంబరు 15





మెదక్ సీఎస్ఐలో ఘనంగా ఉమెన్స్ సండే

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఉమెన్స్ సండేను ఘనంగా నిర్వహించారు. ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో వేకువజామున శిలువ ఆరాధన నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉమెన్స్ సండే కావడంతో మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు మత గురువులు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం, చర్చి ప్రాంగణం కిక్కిరిసింది.

-మెదక్ కల్చరల్, సెప్టెంబరు 15



మైహోం అంకురలో లడ్డూను దక్కించుకున్న నల్లపురెడ్డి గణేష్‌రెడ్డి

గణేష్ లడ్డూ రూ. 12.50 లక్షలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 15: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ ఉర్జిత్ విల్లాస్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం నిర్వహించిన వేలం పాటలో గణేష్ లడ్డూను కాలనీవాసి రూ.12.50 లక్షలకు దక్కించుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు అత్యధిక ధర పలికిన లడ్డూ ఇదేకావడం విశేషం. అలాగే, మైహోం అంకుర విల్లాస్ మండపంలో గణేష్ లడ్డూను నల్లపురెడ్డి గణేష్‌రెడ్డి రూ.6.51 లక్షలకు దక్కించుకున్నారు. పీఏసీఎస్ చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్ తదితరులు లడ్డూను గణేష్‌రెడ్డికి అందించారు. బీహెచ్ఈఎల్ బీమాక్ కాలనీలో గణేష్ లడ్డూను వెంకట్‌రాంరెడ్డి రూ.2.70 లక్షలకు కైవసం చేసుకున్నారు.

పల్లె ఓటర్లు 5,14,705

గ్రామపంచాయతీల్లో మహిళా ఓటర్లే అధికం

ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు

ఈ నెల 21 వరకు అభ్యంతరాల స్వీకరణ

28న తుది జాబితా ప్రకటన

మెదక్ జిల్లాలో 493 గ్రామపంచాయతీల్లో 4,210 వార్డులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15: పల్లె ఓటర్ల లెక్క తేలింది. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వార్డులవారీగా సిద్ధంచేసిన ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ అధికారులు వెల్లడించారు. మెదక్ జిల్లాలోని 20 మండలాల పరిధిలో 493 గ్రామపంచాయతీలు, 4,210 వార్డులు ఉన్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 5,14,705 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 2,47,940 మంది, మహిళలు 2,66,756 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా జాబితాలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను ఈ నెల 21 వరకు ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయవచ్చని డీపీవో యాదయ్య పేర్కొన్నారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం ఈ నెల 28న తుదిజాబితా ప్రకటిస్తామని ఆయన తెలిపారు.



అన్ని మండలాల్లో మహిళలదే ఆధిక్యం

మెదక్ జిల్లాలోని 20 మండలాల్లో 493 గ్రామపంచాయతీలుండగా.. అన్ని మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం‌. మొత్తం 5,14,705 మంది ఓటర్లు ఉండగా.. పురుష ఓటర్లతో పోలిస్తే 18,816 మంది మహిళలు ఎక్కువగా ఉన్నట్లు ముసాయిదా జాబితాలో వెల్లడైంది.

మండలాలవారీగా జీపీల్లో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అల్లాదుర్గం	11,266	12,086	0	23,352
చేగుంట	16,787	17,981	0	34,768
చిపల్‌చెడ్	8,337	8,888	0	17,225
మెదక్	9,918	11,190	1	21,109
హవేళీఘణపూర్	13,856	15,631	0	29,487
కౌడిపల్లి	13,813	14,457	0	28,270
కొల్చారం	12,782	13,965	1	26,748
మనోహరాబాద్	10,078	10,358	0	20,436
నర్సాపూర్	13,327	13,911	1	27,239
నార్సింగి	6,338	6,878	0	13,216
నిజాంపేట	0331	11,080	0	21,411
పాపన్నపేట	19,658	22,041	2	41,701
టేక్మాల్	13,751	14,846	1	28,598
రామాయంపేట	9,190	10,160	0	19,350
రేగోడ్	9,088	9,338	0	18,426
పెద్దశంకరంపేట	15,159	16,143	1	31,303
చిన్నశంకరంపేట	14,820	15,941	0	30,761
శివ్వంపేట	16,385	17,346	1	33,732
వెల్దుర్తి	15,925	17,097	1	33,023
తూప్రాన్	7,131	7,419	0	14,550



పూర్వ విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రొఫెసర్ రఘురామిరెడ్డి

రైతుల ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ ఇంజనీరింగ్ ఊతం

వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డే

కంది, సెప్టెంబరు 15: రైతుల అభివృద్ధికి వ్యవసాయ ఇంజనీరింగ్ సాంకేతికత ఊతమిస్తుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి పేర్కొన్నారు. కంది పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయరంగంలో కృత్రిమమేధ, డ్రోన్ టెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. సాంకేతికతను ఉపయోగించి తక్కువ ఖర్చుతో లాభసాటి దిగుబడి వచ్చేలా రైతులకు తోడ్పానందించాలని పేర్కొన్నారు. ఆధునిక యంత్రాల వినియోగాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం 2011-2018 మధ్య ఏఈఈలుగా ప్రభుత్వ ఉద్యోగం పొందిన 78 మంది పూర్వ విద్యార్థులకు మెమొంటోలు అందజేసి అభినందనలు తెలిపారు.

పంచముఖి గణపతి..

ఘనంగా నిమజ్జనం

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 15: మెదక్ జిల్లాకేంద్రంలోని పంచముఖి గణేష్ మండలి వినాయక నిమజ్జనం ఆదివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. 19వ వార్షికోత్సవం సందర్భంగా ఈసారి 9 రోజులకే నిమజ్జనం చేశారు. శోభాయాత్రలో హైదరాబాద్ నుంచి ఫైర్ ఈవెంట్స్, గాయకులు, సంప్రదాయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో బందోబస్తును ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు.



నిమజ్జనానికి తరలిన పంచముఖి గణపతి



ఆదివారం రాత్రి పట్టణంలోని పలు మండపాలను ఆయన సందర్శించారు. రేపు చేపట్టే నిమజ్జనం సందర్భంగా పట్టణంలో చేస్తున్న బందోబస్తు ఏర్పాట్లను సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేఎన్ రోడ్ గణేష్ మండలి నిర్వాహకులు ఎస్పీని సన్మానించారు.



ఎస్పీని సన్మానిస్తున్న జేఎన్‌రోడ్ గణేశ్ మండలి

భూమి కొనుగోలులో మోసం

నిందితుల అరెస్టు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15: అమ్మకానికి ఉందని ఒక భూమిని చూపించి.. రిజిస్ట్రేషన్ సమయంలో మరో స్థలాన్ని అంటగట్టి మోసం చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి మెదక్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెద్దశంకరంపేటకు చెందిన జంగం శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని ముకుంద నాయక్ తండాకు చెందిన చవాన్‌సాగర్ రియల్‌ఎస్టేట్ మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారు. పెద్దశంకరంపేట పరిధిలోని ఉత్తలూర్ గ్రామ శివారులో రోడ్డు పక్కన భూమి అమ్మకానికి ఉందని ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఆడం జ్యోతి భూమిని కొనుగోలు చేసేందుకు ముందుకువచ్చారు. రూ.31.40 లక్షలకు ఒప్పందం చేసుకొని, డబ్బులు ఇచ్చి భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. భూమిని చూసేందుకు వెళ్లగా తను చూపించిన భూమిని కాకుండా వేరేచోట ఉన్నది రిజిస్ట్రేషన్ చేసినట్టు ఆమె గుర్తించారు. మోసపోయినట్లు గుర్తించి ఏడుగురిపై పెద్దశంకరంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి పలు సెక్షల కింద కేసులు నమోదు చేశారు. ఏ1 చవాన్ సాగర్, ఏ2 జంగం శ్రీనివాస్‌ను మెదక్ కోర్టులో హాజరపర్చగా.. ఇద్దరికి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు. మిగితా వారు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్పీ తెలిపారు. ప్రజలను మోసం చేస్తున్న రియల్ ఎస్టేట్ మాఫియాపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. భూమిని కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



రేగోడులోని మోడల్ స్కూల్

బదిలీలు సరే.. వచ్చేదెవరు?

రేగోడు మోడల్ స్కూల్‌లో 12 మంది ఉపాధ్యాయుల బదిలీ

కొత్తగా ఎవరూ రాకపోవడంతో విద్యార్థుల ఆందోళన

రేగోడు సెప్టెంబరు 15: ఉపాధ్యాయుల బదిలీలతో రేగోడు మోడల్ స్కూల్ ఖాళీ అయ్యింది. ఇక్కడి నుంచి 12 మంది టీచర్లు బదిలీ కాగా.. వీరి స్థానాల్లో ఇప్పటి వరకు ఎవరూ రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మోడల్ స్కూళ్లలో 13 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీలకు అవకాశం కల్పించింది. దీంతో, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ బదిలీపై వెళ్తున్నారు. ఇప్పటివరకు పని చేసిన ఉపాధ్యాయులు పదో తరగతిలో టాప్ ర్యాంకులు వచ్చేందుకు కృషి చేశారు. ఒక్కసారిగా ఉపాధ్యాయులందరూ వెళ్లిపోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడిపోతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు 11 మంది రిలీవ్ అయ్యారని, కొత్తగా ఎవరూ రాకపోవడంతో తాను రిలీవ్ కాలేదని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జయప్రకాష్ తెలిపారు. ఇక్కడికి బదిలీపై ఎవరు వచ్చేది రెండు రోజుల్లో తెలిసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

వర్షం తెచ్చిన నష్టం

సంగారెడ్డి జిల్లాలో 7,318 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

నష్టపోయిన 4,968 మంది రైతులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. పొలాల్లో వర్షను నీరు చేరి వరి నేలకొరిగింది. పత్తి చేలు గిడసబారి ఎండిపోయాయి. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట నీటిపాలైందని అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. వ్యవసాయశాఖ నిర్వహించిన సర్వే ప్రకారం సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 28 మండలాల్లో 4,968 మంది రైతులకు చెందిన 7,318 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2,843 మంది రైతులకు చెందిన 3,317 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. సోయాబీన్ 1,271 ఎకరాల్లో దెబ్బతినగా 475 మంది రైతులు నష్టపోయారు. 997 మంది రైతులకు చెందిన 1,256 ఎకరాల్లో కంది, 138 మంది రైతులకు చెందిన 183 ఎకరాల్లో మినుము, పెసర 346 మంది రైతులకు చెందిన 1,058 ఎకరాల్లో నష్టపోయింది. ఇద్దరు రైతులకు సంబంధించిన ఏడు ఎకరాల్లో చెరుకు పంట దెబ్బతిన్నది. కూరగాయ పంటలు 60 మంది రైతులకు చెందిన 106 ఎకరాల్లో నష్టం జరిగింది.



ఇరిగిపల్లిలో వర్షానికి దెబ్బతిన్న పత్తి

ప్రభుత్వం ఆదుకోవాలి

రైతు భరోసా డబ్బులు రాకపోవడంతో రూ. వేలల్లో అప్పు చేసి పంటలు సాగుచేశామని, ఎరువులు, విత్తనాల కొనుగోలు చేశామని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడిన పంటలు భారీ వర్షాలకు దెబ్బతినడంతో పూర్తిగా నష్టపోయామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సరిపోదని, ఎకరాకు రూ. 25వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అదేవిధంగా రైతు భరోసా డబ్బులు చెల్లించాలని, అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని వివిధ రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పంట పూర్తిగా నీళ్లలో మునిగింది



రెండున్నర ఎకరాల్లో వరి నాట్లు వేశాను. కూలీలకు రోజుకు వెయ్యి రూపాయలు ఇచ్చి నాట్లు వేయించాను. గతవారం కురిసిన భారీ వర్షాలకు వరి నాటు పూర్తిగా నీట మునిగింది. పంట మొత్తం నేలకొరిగి పనికిరాకుండా పోయింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-శ్రీకాంత్, రైతు, కులబ్‌గూర్

వర్షానికి నాలుగెకరాల్లో పత్తి దెబ్బతిన్నది



నాలుగెకరాల్లో పత్తి పంట సాగుచేశాను. వర్షానికి మూడెకరాలు పూర్తిగా దెబ్బతిన్నది. ఇప్పటికే అప్పులుచేసి రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టాం పంట చేతికివస్తే అప్పు తీరుద్దామనుకున్నా. కానీ మూడెకరాలు పూర్తిగా నాశనమైంది.

-మాణిక్యం, రైతు, ఇరిగిపల్లి

ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలి

ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతులు భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయారు. రైతు భరోసా డబ్బులు రాకపోవడంతో అప్పులు చేసి నాట్లు వేశారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-జయరాజ్, రైతు సంఘం నాయకుడు

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికను అందజేశాం. నష్టపరిహారంపై ప్రభుత్వ ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం నష్టపరిహారాన్ని ఇవ్వగానే రైతుల ఖాతాల్లోకే బదిలీ చేస్తాం.

-కే.శివప్రసాద్, సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖాధికారి



పరిశ్రమలో అగ్ని ప్రమాదం

మనోహరాబాద్, సెప్టెంబరు 15: మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని ధనలక్ష్మీ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం పరిశ్రమ లోపల కార్మికులు పని చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. దీంతో పరిశ్రమ సిబ్బంది వెంటనే అప్రమత్తమై నర్సాపూర్ ఫైర్ సేఫ్టీ సిబ్బందికి సమాచారం అందించారు. గంట తరువాత ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ పరిశ్రమలో లాజిస్టిక్ ప్లాస్టిక్, ఫర్నీచర్‌ను తయారు చేస్తారు. అప్పటికే చాలావరకు వస్తువులు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కార్మికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సుమారు రూ.30 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని పరిశ్రమ యజమాని రాము తెలిపారు. పరిశ్రమ నిర్వాహకుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు..



ఘటనా స్థలంలో కార్మికులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్



వినాయక నిమజ్జనాల సందర్భంగా జహీరాబాద్‌కు వచ్చిన పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ రామ్మోహనరెడ్డి

గణనాథుడి నిమజ్జనోత్సవాలకు
అదనపు పోలీసు బలగాలు

● జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి

జహీరాబాద్,సెప్టెంబరు15 : జహీరాబాద్ పట్టణంలో చేపట్టబోయే వినాయక నిమజ్జన ఉత్సవాలకు అదనపు పోలీసు బలగాలను రప్పించినట్లు జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహనరెడ్డి తెలిపారు. ఆదివారం రంజోల్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అదనపు పోలీసు బలగాలతో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఉత్సవాలు ప్రశాంతవాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు పోలీసు సిబ్బంది ఎక్కడెక్కడా విధులను నిర్వహించాలో కేటాయించారు. వీరంతా నాలుగురోజులపాటు జహీరాబాద్‌లోనే ఉంటూ నిమజ్జనాలకు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శివలింగం, ఎస్‌ఐ. కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, సెప్టెంబరు 15: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండల పరిధిలోని రిమ్మనగూడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన శివయ్య(58) మద్యానికి బానిసై ఆదివారం ఉదయం ఇంటి వద్ద శాలువాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు గమనించి గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బి.సైదా తెలిపారు.

విశిష్ట విప్లవానికి దిక్సూచి సీతారాం ఏచూరి

జహీరాబాద్,సెప్టెంబరు15: విశిష్టవిప్లవానికి సీతారాం ఏచూరి దిక్సూచి అని సీపీఎం కార్యదర్శివర్గ జిల్లా నాయకులు రాంచందర్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సంతాపసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్పదేశభక్తి కలిగి ప్రజలసమస్యలపై నిరంతరంపోరాటం చేసిన మహానీయుడు సీతారాం ఏచూరి అన్నారు. కార్యక్రమంలో నేతలు నర్సయ్య, సలీముద్దిన్, నర్సింహులు, నరేష్, తుల్జారాం, రాజు, ఫహీం, రాజేష్, ముజాయత్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేరదు.. ఆకలి తీరదు..

- వాగ్దానాలకే పరిమితమైన మధ్యాహ్న భోజనం
- జూనియర్ కళాశాల్లో అమలుకు నోచుకోని పథకం
- పస్తులతో పాఠాలు వింటున్న వైనం
- జిల్లాలో 16 ఇంటర్ కళాశాలలు.. 5 వేల మంది విద్యార్థులు



మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15 : సర్కారు బడుల్లో మాదిరిగా సన్నరకం బియ్యంతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామన్న ప్రభుత్వ హామీ నెరవేరడం లేదు. ఉదయమే ఇంటి నుంచి కళాశాలలకు వచ్చి చదువుకునే దూరప్రాంతాల విద్యార్థులు మధ్యాహ్నం తినకుండానే పాఠాలు వింటున్నారు. కొంతమంది ఇంటి నుంచి టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటుండగా.. మరికొందరు నీరసంగా పాఠాలు వింటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏటా హామీ ఇవ్వడం.. ఆచరణలో పెట్టకపోవడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం కూడా మారటంతో దీని గురించి మాట్లాడే వారు లేకుండా పోయారు.

దూరప్రాంత విద్యార్థులకు నిరాశే...

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతుంటారు. కిలో మీటరు మొదలు కొని 20 కిలోమీటర్ల దూరం నుంచి కూడా కళాశాలలకు వచ్చేవారున్నారు. ఉదయం ఇంట్లో భోజనం సిద్ధం కాక లంచ్ బాక్స్‌లు తెచ్చుకోవడం లేదు. దాంతో మధ్యాహ్నం చాలా మంది ఖాళీ కడుపుతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఆకలితో చదువుపై తగిన దృష్టిని పెట్టలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే వీరికోసం మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తామని నాలుగేళ్ల కింద అప్పటి ప్రభుత్వం ప్రకటించినా.. అమలుకాలేదు. ఇటీవల ఏర్పడిన కొత్త ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తుందేమోనని భావించిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. హామీ నేటికీ అమలు చేయకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రయోజనం..

జిల్లావ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీ య సంవత్సరంలో 5040 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే వేలాది మంది పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

తక్షణమే అమలు చేయాలి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని ఇచ్చిన హామీని ఎప్పుడూ అమలు చేస్తారో తెలియడం లేదు. ఎన్నో వేదికలు, సమావేశాల్లో మంత్రులు, ఉన్నతాధికారుల హామీలు బుట్టదాఖలు కావడం చూస్తుంటే పేద విద్యార్థులపై పభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో ఊహించుకోవచ్చు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

– దినాకర్, ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి

చెరువులో పడి బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు

దుబ్బాక, సెప్టెంబరు 15 : ప్రమాదవశాత్తు చెరువులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటుచేసుకున్నది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం కొమురవెల్లి మండలం గౌరాయిపల్లి గ్రామానికి చెందిన బండి నవీన, యాదగిరిల కుమారుడు సాయి(7) తల్లితో కలిసి అప్పనపల్లిలోని అమ్మమ్మగారి ఇంటికి దేవుని పండుగకు వచ్చాడు. ఆదివారం కుటుంబీకులు బట్టలు ఉతికేందుకు చెరువు వద్దకు వెళ్లగా బాలుడు వెంటవెళ్లాడు. ఈ తరుణంలో సాయి చెరువుకట్టపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. కాసేపటికి తల్లి నవీనాకు కొడుకు కనింపిచకపోవడంతో తన తమ్ముడికి ఫోన్ చేసింది. అక్కడి చేరుకున్న అతడు చెరువులోకి దూకి బాలుడి మృతదేహాన్ని వెలికితీశారు. సాయి మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. తల్లి నవీనా ఫిర్యాదుమేరకు దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసున మోదు చేసుకుని దర్యాప్తును చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాయిలపూర్ విద్యార్థులు



ఎంపికైన రాయిలపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

కౌడిపల్లి, సెప్టెంబరు 15: సంగారెడ్డి జిల్లాలోని బానురులో ఆదివారం జరిగిన కరాటే అండర్ 14 కాటాస్ పోటీల్లో మండలంలోని రాయిలపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ధనుశ్రీ, పల్లవి, భావన గోల్డ్ మోడల్ సాధించగా, అర్చన, కృష్ణవేణి సిల్వర్ మోడల్, మనోజ్‌రాజ్‌కు మెడల్స్ సాధించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తా చాటిన కాళ్లకల్ చిన్నారులు..



మెడల్స్, సర్టిఫికెట్లతో కాళ్లకల్ గ్రామ చిన్నారులు

మనోహరాబాద్, సెప్టెంబరు 15: కరాటే టోర్నమెంట్‌లో కాళ్లకల్ గ్రామానికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు. పటాన్‌చెరులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో కాళ్లకల్ నుంచి 30 మంది పాల్గొని.. 18 మంది గోల్డ్, 8 మంది సిల్వర్, 4 మంది బ్రౌన్జ్ మెడల్స్ సాధించారు. ఇందులో చాంపియన్ షిప్ విన్నర్ రేశ్విత, జ్యోతి, రవి కుమార్, కరాటే మాస్టార్లు నత్తి మల్లేష్, లక్ష్మణ్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

రాణించిన సాయికృప విద్యార్థులు..



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొండపాక, సెప్టెంబరు 15 : కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన సాయి కృప హై స్కూల్ విద్యార్థులు కరాటేలో సత్తా చాటారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోటీల్లో పాఠశాలకు చెందిన అభిజ్ఞ, నిరూపంగౌడ్ గోల్డ్ మెడల్, అవంతిక సిల్వర్ మెడల్ గెలుచుకోగా, అస్మిత కాంస్య పథకాన్ని కైవసం చేసుకున్నది. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వనజ , పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ప్రపంచ దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం

● రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత



కాల్వ సుజాతను సన్మానిస్తున్న మహిళలు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 15: ప్రపంచ దేశాల్లో మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు దక్కుతున్నదని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. ఆదివారం జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవాభావం, దాతృత్వం ఆర్య వైశ్యులకే సొంతమన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ గుప్త, శ్రీనివాస్, సీనియన్ నాయకులు వెంకటయ్య, మహేందర్, బాలనారాయణ, చంద్రశేఖర్, నాగరాజు, కొండలు, వెంకటేశం, అమరరాము, శ్రీనివాస్, రామ్‌నివాస్, పెద్ది శంకర్‌గుప్త, పెద్ది శ్రీనివాస్, కిరణ్, ఆర్యవైశ్య నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు కిషన్‌రావు పోరాటం చిరస్మరణీయం

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



డాక్టర్ కిషన్‌రావు సంతాప సభలో ప్రసంగిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరు, సెప్టెంబరు 15: జిల్లాలోని పారిశ్రామిక వాడల్లో రసాయన పరిశ్రమల కాలుష్య నివారణకు డాక్టర్ కిషన్‌రావు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కొనియాడారు. ఆదివారం పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన కిషన్‌రావు సంతాప సభకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో పరిశ్రమలు వదిలే కాలకుట విశంలాంటి వ్యర్థాలతో పర్యావరణం దెబ్బతింటున్న దారుణాలను బయటి ప్రపంచానికి మొట్ట మొదట తెలియజేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఆయన చేసిన పోరాటాల ఫలితంగా సుప్రీంకోర్టులో కాలుష్య పీడిత రైతులకు నష్టపరిహారం అందిందన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త డా.పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ కాలుష్యంపై డాక్టర్ కిషన్‌రావు చేసిన ఉద్యమాలు అంతర్జాతీయ మీడియా సంస్థలను సైతం ఆకర్షించాయన్నారు. సభలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఆర్‌టీఐ కమిషనర్ దిలీప్ ఎరెడ్డి, పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ నరసింహారెడ్డి, శిల్పకృష్ణ, మాజీ జడ్‌పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అంజిరెడ్డి, పాశమైలారం పరిశ్రమల సంఘం అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తెలంగాణ ప్రాంత మహా సద్భావ్ ప్రముఖ్ రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకుడు నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నాయకులు రవి, భిక్షపతి, యాకూబ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ గుప్త, శేషాద్రి, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమిస్తే సీపీఐకి పూర్వ వైభవం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మహ్మదాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్‌రూరల్, సెప్టెంబర్ 15 : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రకు వారసులు కమ్యూనిస్టులేనని, నాడు సీపీఐ పోరాటాల ఫలితంగానే తెలంగాణను భారత దేశంలో విలీనం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లోని తెలంగాణ సాయుధ పోరాట అమరులు అనభేరి ప్రభాకర్ రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి స్మారక ఘాట్ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వెంకటరెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలన్నారు. పార్టీ కార్యకర్తలందరూ సంఘటితంగా ఉద్యమించి సీపీఐకి పూర్వ వైభవం తేవాలన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి పిట్టల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ మండల కార్యదర్శి గడిపె మల్లేశం, ఎడల వనేష్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ సిద్దిపేట, కరీంనగర్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి మహ్మదాపూర్‌లోని అమరుల ఘాట్ వద్ద జిల్లా కార్యదర్శులు మంద పవన్, మర్రి వెంకటస్వామి నివాళులర్పించారు. ఏటా సీపీఐ నాయకత్వం ఒకే తాటిపై విమోచన వేడుకలు నిర్వహించే వారు. కానీ ఈసారి జిల్లా, మండల నాయకత్వాలు వేర్వేరుగా నిర్వహించడం చర్చనీయ అంశంగా మారింది.

హుస్నాబాద్‌లో.

హుస్నాబాద్ టౌన్/హుస్నాబాద్, సెప్టెంబరు 15: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలో పోరాట యోధుడు అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ కూడా అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, రాష్ట్ర సమితి సభ్యులు పొన్నగంటి కేదారి, కోయ్యడ సృజన్ కుమార్, రాష్ట్ర సమితి మాజీ సభ్యులు దయానంద రెడ్డి, నేతలు ఎడల వనేష్, జేరిపోతుల జనార్దన్ పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

వియత్నాం దేశ కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు స్టడీ టూర్‌కు వెళ్లివచ్చిన సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డికి సత్తా, స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సమస్త సమాచార వేదిక యూడైస్ ప్లస్



శిక్షణ ఇస్తున్న ఎంఐఎస్ సురేందర్

- విద్యార్థులు, టీచర్లు, వసతుల వివరాలన్నీ ఒకేచోట
- దీన్ని ఆధారంగానే పాఠశాలల ప్రగతికి ప్రణాళికలు
- ఈ నెలాఖరులోగా వివరాల నమోదు పూర్తికి చర్యలు



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కొండపాక, సెప్టెంబరు 15 : పాఠశాలల ప్రగతి యూడైస్(యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్) పోర్టల్ కీలకం. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆర్థిక, వసతుల వివరాలు ఇందులో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సిందే. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోగా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల సంఖ్య తేల్చేందుకు చర్యలు చేపట్టారు. యూడైస్ పోర్టల్‌లో సర్వం సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుండగా.. దీన్ని ఆధారంగా విద్యాశాఖ ఏటా ప్రణాళికలు రూపొందించనుంది. పాఠ్య రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితరవాటికీ యూడైస్ ఆధారంగానే నిధులు కేటాయిస్తారు. సిద్దిపేట జిల్లాలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రాథమిక పాఠశాలలు 629, ప్రాథమికోన్నత 114, ఉన్నత 219, జూనియర్ కళాశాలలు 47, కేజీబీవీలు 22 , ఆదర్శ పాఠశాలలు 14, గురుకులాలు 36, ప్రైవేట్ పాఠశాలలు 226 ఉన్నాయి. మొత్తం 1307 విద్యాసంస్థల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

మూడు గంటలకోసారి అప్‌డేట్

జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఇదివరకే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 2021-22 వరకు యూడైస్‌గా కొనసాగగా.. గత విద్యా సంవత్సరం నుంచి యూడైస్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేశారు. మూడు గంటలకోసారి సాంకేతికత ఆధారంగా సమాచారం అప్‌డేట్ చేయడం దీన్ని ప్రత్యేకత. ఈ వెబ్‌సైట్‌ను పాఠశాల భౌతిక వసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మాడ్యుల్స్‌గా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. పాఠశాలకు క్రీడా స్థలం ఉందా, తరగతతి గదులెన్ని, ఇంకా అవసరమైనమైన వసతులేమి వంటి వివరాలను ఎప్పటికప్పుడూ అప్‌డేట్ చేస్తున్నారు.

ప్రతి విద్యార్థికీ 'పెన్'..

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న యూడైస్ ప్లస్ పోర్టల్‌లో వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన ప్రతి విద్యార్థికీ ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్(పెన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలలో ఏఏ తరగతులు చదివాడు ఖచ్చితంగా తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా యూడైస్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య ఆధారంగానే పాఠ్యపుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, నోటు పుస్తకాల పంపిణీ చేస్తుంది. గత ఏడాది నుంచి పదో తరగతి విద్యార్థుల నామినల్ రూల్స్ కోసమూ యూడైస్ డాటానే పరిగణలోకి తీసుకుంటున్నారు.

టీచర్లకు జాతీయ కోడ్..

విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు కూడా ఒక జాతీయ కోడ్ నెంబర్‌ను యూడైస్ కేటాయిస్తుంది. తద్వారా ప్రతి పాఠశాలలో కచ్చితంగా నమోదయ్యే విద్యార్థుల సంఖ్యతోపాటు ఉపాధ్యాయుల సంఖ్య కూడా తెలుస్తుంది. తద్వారా ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి లెక్కించొచ్చు. ఈ విధంగా యూడైస్‌లో నమోదు చేసే వివరాలను అత్యంత గోప్యంగా, ప్రామాణికంగా నిర్వహించడానికి మండల విద్యాధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర సంచాలకుల కార్యాలయం వరకు వివిధ అంచెల్లో సిబ్బందికి శిక్షణ పూర్తిచేశారు. ఈ ప్రాముఖ్యత దృష్ట్యా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠశాలకు సంబంధించిన సమగ్ర వివరాలను యూడైస్ ప్లస్‌లో నిర్ణీత గడువులోపు నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు

శిక్షణా కార్యక్రమాలు...

ఈ వివరాల నమోదును ఎలా చేయాలో ప్రధానోపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంఈవో, పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు శిక్షణ ముగియగా.. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు మండల స్థాయిలో శిక్షణ దాదాపు పూర్తి చేశారు. అన్ని విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు వివరాలను ఈ పోర్టల్‌లో నమోదు చేసి మండల విద్యాధికారి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సంతకంతో జిల్లా విద్యాశాఖకు అందజేయాల్సి ఉంటుంది.

ఘనంగా శ్రవణ నక్షత్ర పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వర్గల్, సెప్టెంబరు 15 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేతులైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, గణపతి హోమం, లక్షతులసీ అర్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్దాంతి ఆధ్వర్యంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదాలను అందజేశారు. ఇక్కడున్న లక్ష్మీగణపతి ఆలయంలో వినాయక నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం వినాయకుడిని నిమజ్జన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వరుసగా ఢీకొన్న వాహనాలు



ధ్వంసమైన కార్లు, బైకు

కొండపాక, సెప్టెంబరు 15 : కొండపాక మండలం దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై ఒకదానికొకటి వాహనాలు వరుసగా ఢీకొట్టుకున్నాయి. దాంతో వాహనాలు ధ్వంసం కాగా ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హైదరాబాదు నుంచి సిద్దిపేటకు వెళ్తున్న కారు దుద్దెడ శివారులో సడన్ బ్రేక్ వేయగా వెనకనే ఉన్న కారు ముందు కారుకు ఢీ కొట్టి డివైడర్‌కు అటువైపు రోడ్డుకు దూసుకెళ్లి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. ఇది గమనించిన బస్సు డ్రైవర్ పక్కకు తీసుకుంటుండగా బస్సు పక్కనే ఆటోకు ఢీ కొట్టింది. ఆటో ఆ పక్కన ఉన్న మోటార్ సైకిల్ కు ఢీ కొట్టింది. ఇలా వరుస వాహనాలు ఢీ కొట్టుకోవడంతో రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

వర్గల్, సెప్టెంబరు 15 : హత్య చేశాడన్న కోపంతో ఓ కుటుంబ సభ్యులు బెయిల్‌పై వచ్చిన వ్యక్తిని చితకబాదడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో తొమ్మిది మందిపై గౌరారం పోలీసులు హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి ఆదివారం వివరాలను వెల్లడించారు. వర్గల్ మండలం మినాజీపేట గ్రామానికి చెందిన బానపురం యాదగిరి, అదే గ్రామానికి చెందిన కీసర ఆనంద్ ఇద్దరు కలిసి ఐదు నెలల క్రితం మెదక్ జిల్లా తూప్రాన్ సమీపంలో మద్యం సేవిస్తుండగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. మద్యం మత్తులో బానపురం యాదగిరి కర్ర తీసుకుని ఆనంద్‌ను కొట్టడంతో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయమై తూప్రాన్ పోలీసులు కేసు నమోదు చేసి బానపురం యాదగిరిని రిమాండ్‌కు పంపించారు. రెండునెలల క్రితం బెయిల్‌పై వచ్చిన యాదగిరి భార్యాపిల్లలతో కలిసి మెడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బాలాజీనగర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 13న శుక్రవారం రాత్రి 10.30 చిట్టి డబ్బులు ఇవ్వడానికి యాదగిరి మినాజీపేట గ్రామానికి వచ్చి అతని తల్లి చంద్రవ్వతో మాట్లాడుతుండగా అప్పటికే అతనిపై కోపంతో ఉన్న కీసర ఆనంద్ కుటుంబ సభ్యులు అతడిపై రాళ్లతో దాడిచేస్తూ గ్రామపంచాయతీ కార్యాలయం వరకు లాక్కోని వెళ్లారు. దీంతో తీవ్ర గాయాలపాలైన యాదగిరిని ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. యాదగిరి తల్లి చంద్రవ్వ ఫిర్యాదు మేరకు కీసర ఆనంద్ కుటుంబ సభ్యులైన అరుణ్‌కుమార్, ప్రశాంత్, నాగరాణి, పాపమ్మ, రమాదేవి, నర్సింహులు, నగేశ్, రమేశ్, వెంకటేశ్‌లపై హత్యాయత్నం, ఎస్సీఎస్టీ కేసులు నమోదు చేశారు. ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అప్పులు తీర్చలేక గృహిణి ఆత్మహత్య



జయమ్మ (ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 15 : కొడుకు అనారోగ్యానికి చేసిన అప్పు తీర్చలేక గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన బుడిగే జయమ్మ (50) కొడుకు శ్రీకాంత్ గుండె చికిత్సకు కోసం పెద్ద ఎత్తున అప్పులు చేసింది. అవి తీర్చే మార్గం కానరాక ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పొలం వద్ద చెట్టుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కొడుకు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. కాగా, అంత్యక్రియలకు రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్, సెప్టెంబరు 15: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గజ్వేల్ మండలం అక్కారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బుడిగె స్వామి(31) గ్రామ పంచాయతీ పారిశుద్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై ఈ నెల 11న గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన రమేశ్

మాసాయిపేట సెప్టెంబరు 15న్యూ :రోడ్డు దాటుతున్న యువకుడిని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట మండలం నడిమి తండా కు చెందిన మెగావత్ రమేశ్ (34) చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ రాయల్ ట్రావెల్స్ బస్సు అతి వేగంగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కొంపల్లి శిఖర ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

నిమజ్జన బందోబస్తుకు శిక్షణ కానిస్టేబుళ్లు

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: ఖేడ్ మున్సిపాలిటీతో పాటు మండల కేంద్రాలు, పెద్ద గ్రామాల్లో వినాయక నిమజ్జనాల కోసం వివిధ జిల్లాల్లో శిక్షణ తీసుకుంటున్న దాదాపు 100 శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్ల ఖేడ్‌కు పంపారు. బందోబస్తుకు వారితో పాటు డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందిని వినియోగించనున్నారు. వారికి ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో వసతిని కల్పించారు. ఆదివారం స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి వినాయక శోభాయాత్రలు, చెరువుల వద్ద బందోబస్తులకు సంబంధించిన అంశాలను వివరిస: అవగాహన కల్పించారు. ఆయన వెంట ఖేడ్, నాగల్‌గిద్ద ఎస్ఐలు విద్యాచరణ్ రెడ్డి, సాయిలు తదితరులు ఉన్నారు.



ట్రైనీ కానిస్టేబుళ్లకు సూచనలిస్తున్న పోలీస్ అధికారులు

17 న జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రకటించాలి

● బీఎంఎస్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 : విశ్వకర్మ జయంతి సెప్టెంబరు 17 న జాతీయ కార్మిక దినోత్సవంగా జరపాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు సప్తకుల వృత్తులకు అన్ని పనిముట్లు అందించిన మహోన్నత ఆదిదేవుడు విశ్వకర్మ అని కొనియాడారు. విశ్వకర్మ జయంతిని బీఎంఎస్ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటుందన్నారు. విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు సెప్టెంబరు 17 న జాతీయ కార్మిక దినోత్సవం అధికారికంగా నిర్వహించే వరకు బీఎంఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ నెల 17 న జిల్లా వ్యాప్తంగా బీఎంఎస్ యూనియన్‌ల కార్మికులు జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించాలని మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

సామాజిక బహిష్కరణ చేసిన వారిని అరెస్టు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 15 : డప్పు కొట్టమన్నందుకు సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామానికి చెందిన యువకులు ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు చేస్తున్నామని చంద్రం, అర్జున్‌లు డప్పులు కొట్టమని అన్నందుకు గ్రామ పెత్తందారులు వారిని సామాజిక బహిష్కరణ చేయడం దారుణమన్నారు. సామాజిక బహిష్కరణ చేసిన పెత్తందారులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని మాణిక్యం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తిని స్వగ్రామానికి చేర్చారు


తప్పిపోయిన వ్యక్తి

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మన్సూర్‌పూర్‌లో ఓ గుర్తు తెలియని 40 సంవత్సరాల వ్యక్తి అయిదారు రోజులుగా సంచరిస్తున్నాడు. ఆదివారం నీరసించి రోడ్డు పక్కన పడి పోవడంతో కాంగ్రెస్ నాయకుడు హన్మంతు ఆరాతీయగా తన పేరు యాదుల్ అని చెప్పి మిగతా వివరాలు చెప్పలేకపోయాడు. దీంతో అయన ఖేడ్ ముస్లిం సంక్షేమ సంఘం బాధ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వెళ్లి ఆరాతీయగా తన గ్రామం ఆందోల్ మండలం అన్నాసాగర్ అని, తనతండ్రి పేరు హనీఫ్ అని తెలిపినట్టు చెప్పారు. తాను నడుచుకుంటూ ఇక్కడకు వచ్చానని తెలిపాడు. సంఘం బాధ్యులు స్థానిక పోలీసులకు సమాచారం అందించి వారి సహకారంతో అతడిని స్థానిక ఏరియా వైద్యశాలలో వైద్యం చేయించి అన్నా సాగర్‌లో అతడి కుటుంబీకుల వివరాలు తెలుసుకొని పంపించారు.

మునిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మల్లిక

మునిపల్లి, సెప్టెంబరు 15: మునిపల్లి మోడల్ స్కూల్, కాలేజ్ ప్రిన్సిపాల్‌గా మల్లిక ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మునిపల్లి మోడల్ స్కూల్, కాలేజ్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన భాస్కర్ రెడ్డి హత్నూర మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వట్‌పల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన మల్లిక ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మల్లికకు టీచర్లు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యా సంస్థల్లో సత్యసాయి సేవాసంస్థ కార్యక్రమాలు

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఖేడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సమీకృత బాలుర వసతి గృహాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. సేవాసమితికి చెందిన మహిళా వలంటీర్లు కస్తూర్బా విద్యాలయంలో, పురుష వలంటీర్లు సమీకృత వసతీ గృహంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా తరగతి, వసతి, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఆవరణలను శుభ్రం చేశారు. ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటారు. ఎ

'ప్రతీ విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వారియర్స్ క్లబ్ ట్రైనర్ నర్సింహారెడ్డి సూచించారు. ఆదివారం గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్టిఫైడ్ ట్రైనర్ రమేష్, గురుకుల సంక్షేమాధికారిని బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

హవేళిఘణపూర్, సెప్టెంబరు 15: మండలంలోని సుల్తాన్‌పూర్‌తండాకు చెందిన రమావత్ వసురాం ఇటీవల దుబాయ్‌లో మరణించగా విషయం తెలుసుకున్న డాక్టర్ మోహన్ నాయక్ ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి నెలకు సరిపోను నిత్యావసర సరుకులు, రూ.5వేల సాయాన్ని అందించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, శానిక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు శివ నాయక్ తదితరులున్నారు.

మాజీ జడ్పీటీసీకి మాతృవియోగం

హవేళిఘణపూర్, సెప్టెంబరు 15: హవేళిఘణపూర్ మండలంలోని జక్కన్నపేట గ్రామానికి చెందిన మెదక్ ఉమ్మడి మండల జడ్పీటీసీ మామిళ్ల ఆంజనేయులు తల్లి మామిళ్ల గంగమ్మ (80) ఆదివారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సందర్శించి గంగమ్మ పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రెడ్డిపల్లి మాజీ సర్పంచ్‌కు సేవా రత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న అశోక్‌గౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 15: నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో సేవారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. తాను పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని అందుకు తనను గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు ప్రదానం చేసిన హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

పీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

జిన్నారం/నర్సాపూర్, సెప్టెంబరు 15: పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఆదివారం గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకరోత్సవానికి పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బొల్లారం మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వివిధ గ్రామాల కార్యకర్తలు హాజరయ్యారు. అదేవిధంగా నర్సాపూర్ నియోజకవర్గం నుంచి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు మణిదీప్, వెల్దుర్తినరేందర్‌రెడ్డి, కొల్చారం మల్లేశంగౌడ్ తదితరులు ఉన్నారు.

సర్కారు బడుల్లో కంప్యూటర్ శిక్షణ

● ఖేడ్‌లోని పాఠశాలల్లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో కంప్యూటర్ల ఏర్పాటు

● స్థానిక ఎమ్మెల్యే తోడ్పాటుతో విద్యార్థులకు 3నెలల పాటు శిక్షణ

నారాయణఖేడ్, సెప్టెంబరు 15: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. కాగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి చొరవతో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా కంప్యూటర్ శిక్షణను ప్రారంభించారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌లోని 3 ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధనను ప్రారంభించారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం

హైదరాబాద్‌లోని బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నారాయణఖేడ్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాల, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం కోసం శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఇటీవల శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఒక్కో పాఠశాలలో దాదాపు 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణలో స్వచ్ఛంద సంస్థ సహకరిస్తుండగా, ఎమ్మెల్యే కూడా తనవంతు సహకారం అందిస్తూ పాఠశాలల్లో కంప్యూటర్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేయించారు. ఇప్పటికే పాఠశాలల్లో ప్రత్యేకంగా తెచ్చిన కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. పాఠశాలకు ఒక్కరూ చొప్పున కంప్యూటర్‌ను బోధించే అధ్యాపకులను నియమించారు. వారికి స్వచ్ఛంద సంస్థ సహకారంతో వేతనాన్ని చెల్లిస్తారు. కంప్యూటర్ ఎడ్యుకేషన్, త్రీడి క్లాసులు, హెల్త్, యోగా, సమాజంలో ఎలా ఉండాల తదితర అంశాలపై విద్యార్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. అయా పాఠశాలలకు ఇంటర్‌నెట్ సదుపాయం కూడా కల్పించారు. ఇందుకు గాను బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కృష్ణ పార్‌శెట్టి ద్వారా పాఠశాలల్లో ప్రత్యేకంగా కంప్యూటర్లను ఏర్పాటు చేయించారు. సంస్థ ప్రతినిధులు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లను పరిశీలించి ప్రారంభించారు.


ఖేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి(ఫైల్)

కంప్యూటర్ బోధన హర్షణీయం



మా పాఠశాలలో కంప్యూటర్ బోధన చేపట్టడం మాకు చాలా సంతోషంగా ఉంది. చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం నేర్చుకోవాలని మాకు ఉత్సాహంగా ఉంది. తప్పకుండా తర్ఫీదు పొందుతానని తెలిపారు. సర్కారు బడిలో మాలాంటి విద్యార్థులకు కంప్యూటర్ సదుపాయం కల్పించడం బాగుంది.

- భవానీ, 8వ తరగతి

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

నేను మొదటి నుంచి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాను. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది పేద విద్యార్థులు కాబట్టి వారికి కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తే జీవితంలో మరింత ఎదిగేందుకు తోడ్పడుతుంది. అందుకే హైదరాబాద్‌కు చెందిన బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కృష్ణ పార్‌శెట్టి సహకారంతో పట్టణంలోని అత్యధిక విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను ప్రారంభించాం

- పట్లోళ్ల సంజీవరెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే

కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం


హైదరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ నేత నీలంమధు ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు, సెప్టెంబరు 15: కాంగ్రెస్ పార్టీతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించడం ఇందుకు నిదర్శనమని కాంగ్రెస్ నేత అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా గన్‌పార్క్ నుంచి గాంధీభవన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన తన అనుచరులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించిన మహేష్‌గౌడ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలలో సామాజిక న్యాయం పాటిస్తున్న చరిత్ర కేవలం కాంగ్రెస్‌లోనే ఉందన్నారు. ఆయన నాయకత్వాన్ని బలపరిచిన ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టివిక్రమార్కలకు రుణపడి ఉన్నామన్నారు. ర్యాలీలో నీలంమధుతో పాటు క్రీడా కార్పొరేషన్ చైర్మన్ శివసేనరెడ్డి, హైదరాబాద్ సెంట్రల్‌జోన్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి పాల్గొన్నారు.

సిద్దార్థ్ స్కూల్‌లో ఓనం వేడుకలు


ఓనం వేడుకల్లో కేరళ టీచర్లతో సిద్దార్థ్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ చౌదరి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 15: కేరళ సంస్కృతి సంప్రదాయాలను తలపించేలా నిర్వహించిన ఓనం వేడుకలకు ఆదివారం పట్టణంలోని సిద్దార్థ్ ఉన్నత పాఠశాల వేదికైంది. ఉత్సవాలను విద్యా సంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి లాగే కేరళవాసులకు ఓనం పండుగ జరుపుకుంటారన్నారు. మలయాళీల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే ఓనంను జాతీయ పండుగగా గుర్తించడం శుభపరిణామమన్నారు. పలు రకాల పుష్పాలతో రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కేరళ సంప్రదాయ దుస్తులను ధరించి ఆటపాటలతో సందడి చేశారు. ఓనం పండుగ ప్రత్యేకత అయిన పాయసాన్ని తయారు చేసి అందిరికీ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, కేరళ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొప్పులపల్లి ఘర్షణలపై పోలీసుల విచారణ

మాసాయిపేట, సెప్టెంబరు 15: మండలంలోని కొప్పులపల్లి గ్రామంలో ఒకే కులంలోని పలు కుటుంబాల మధ్య తలెత్తిన ఘర్షణలపై ఆదివారం వెల్దుర్తి ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. కాగా నిందితులు మల్ల నాగరాజు, ప్రవీణ్, మహేష్, నరేష్, శివయ్య, అఖిల, దర్మేందర్ తమను మల్కా కృష్ణ తదితరులు కుల బహిష్కరణ చేసినట్లుగా చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తమ విచారణలో తేలిందని ఎస్ఐ చెప్పారు.

శాంతియుతంగా నిమజ్జనం చేద్దాం

● సార్వజనిక్ గణేష్ ఉత్సవకమిటీ అధ్యక్షుడు కర్‌దాస్ మనోహర్



జహీరాబాద్,సెప్టెంబరు 15: ఈ నెల 17న చేపట్టే వినాయక నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా చేపడుదామని సార్వజనిక్ గణేష్ ఉత్సవకమిటీ అధ్యక్షుడు కర్‌దాస్ మనోహర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే నిమజ్జన ఉత్సవాల్లో ఉత్సవకమిటీ సభ్యులు, మండపాల నిర్వాహకులు అధికారులకు, నాయకులకు సహకరించాలని కోరారు. అయితే పట్టణంలోని ప్రధాన వీధులగుండా ర్యాలీగా తీసుకువచ్చిన వినాయకవిగ్రహాలను సుభాష్‌గంజ్‌లో ఏర్పాటుచేసిన లారీల్లో పెట్టాలన్నారు. తదనంతరం తమ ఉత్సవకమిటీ సభ్యులు, అధికారులు ఆ వినాయకవిగ్రహాలను కొత్తూర్(బి) గ్రామంలో గల నారింజ ప్రాజెక్టులోకి తీసుకెళ్తారన్నారు. అదేరోజు సాయంత్రం సార్వజనిక్ ఉత్సవకమిటీ సమావేశం ఉంటుందన్నారు. అందరం కలిసిమెలిసి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా చేపడుదామని ఆయన కోరారు.

జహీరాబాద్ పట్టణంలో 156 వినాయకవిగ్రహాలను ప్రతిష్ఠించగా అందులో 5రోజులకుగాను 40విగ్రహాలను నిమజ్జనం చేశారన్నారు. 9రోజులకుగాను ఆదివారం 46 వినాయవిగ్రహాల నిమజ్జనాలు పూర్తయ్యాయని, ఈ నెల 17న మిగిలిన 76 విగ్రహాలను నిమజ్జనం చేయనున్నట్టు ఆయన వివరించారు. నిమజ్జనం చేసే నారింజప్రాజెక్టు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయడమైందని ఆయన తెలిపారు.

ధర్మబద్ధంగా జీవిస్తే మనస్సుకు శాంతి



కల్హేర్‌లో భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషం చేస్తున్న అవధూత మహరాజ్

కల్హేర్, సెప్టెంబరు 15: ప్రతి మానవుడు ధర్మబద్ధంగా జీవనం కొనసాగిస్తే తన జీవితానికి, మనస్సుకు శాంతి లభిస్తుందని మల్లయ్య గిరి ఆశ్రమ పీఠాధిపతి డా.బసవ లింగ అవధూత మహరాజ్ పేర్కొన్నారు. కల్హేర్‌లో గణపతి నవరాత్రుల సందర్భంగా స్థానిక మహంకాళీ యువ జనసంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో ఆయన భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. మానవులు గురువులను ఆశ్రయించకపోవడంతో జీవన విధానంలో పొరపాట్లు చేస్తూ ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీని వలన మనసుకు శాంతి కరువై కష్టాల పాలవుతున్నాడన్నారు. ధర్మబద్ధంగా జీవించడం నేర్చుకుంటే తప్పులు చేసే ఆస్కారమే ఉండదని అవధూత మహరాజ్ అన్నారు. కార్యక్రమంలో మహంకాళీ యువ జన సంఘం బాధ్యులు పండరి, వంశీగౌడ్, పరుశురామ్, గోపాల్, విఠల్, బాగయ్య, కిష్టయ్య, రమేష్, చంద్రయ్య, మణికంఠ, బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు కరణం సంగమేశ్వర్‌రావ్, మాజీ సర్పంచ్ లక్ష్మీ బాలయ్య, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలి


దండుపల్లి గ్రామానికి చేరుకున్న దళిత సమన్వయ పాదయాత్ర

మనోహరాబాద్, సెప్టెంబరు 15: దళితులకు ఎస్సీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెరా సిద్దార్థ పేర్కొన్నారు. దళిత సమన్వయ పాదయాత్ర 15వ రోజు ఆదివారం మండలంలోని దండుపల్లి వరకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిమిలేయర్ విధానం అమలు చేస్తే దళిత కులాలన్నింటికీ సమ న్యాయం జరుగుతుందన్నారు. అన్ని కులాల మాదిరిగానే క్రిమిలేయర్ అమలు చేయాలని కోరారు. 40 రోజుల పాటు ఈ యాత్ర జరుగుతుందని, గద్వాల్ జిల్లా అలంపూర్ వరకు అక్టోబర్ 10న ఈ యాత్ర ముగుస్తుందని తెలిపారు. దండుపల్లి గ్రామంలో మారాటి రాజు, బిక్షపతి, దళితులు యాత్రకు ఘన స్వాగతం పలికారు.

దళితులు వినాయకుడిని మొక్కితే మైలపడతాడా?

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

హవేళిఘణపూర్, సెప్టెంబరు 15: దళిత మహిళలు వినాయకుడిని మొక్కితే దేవుడు మైలపడతాడా అని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రశ్నించారు. మండలంలోని శమ్నాపూర్ గ్రామంలో వినాయకుడిని మొక్కడానికి వెళ్లిన మహిళలను కులం పేరుతో దూషించి, దాడి చేసిన ఘటనపై మానవ హక్కుల వేదిక బృందం, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పిశంకర్ బాధిత కుటుంబాలను కలిసి వివరాలను తెలుసుకున్నారు. దళిత మహిళలపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, వారిపై బనాయించిన కౌంటర్ కేసులను ఎత్తివేయాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌ను కోరారు. అనంతరం దళితులతో కలిసి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు అహ్మద్, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, జిల్లా కార్యదర్శి దయాసాగర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రవి మాదిగ, బాధితులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 15: చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబానికి సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు దరావత్ శివ బియ్యం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సానిక్ష ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఓ వైపు ప్రత్యేక పూజలు.. మరోవైపు నిమజ్జనాలు


సంగారెడ్డిలో వినాయక పండపం వద్ద నిర్వాహకులతో కౌన్సిలర్ సోహెబ్ అలీ, ముస్లిం యువకులు


సంగారెడ్డి నేతాజీ నగర్‌లోని గణేషుడికి భక్తుల పూజలు



జహీరాబాద్: విద్యుత్‌కాలనీ హనుమాన్‌మందిర్ వద్ద వినాయకుడికి 100రకాల నైవైద్యం, వినాయవిగ్రహాలను దర్శించుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులు

వినాయక నవరాత్రి ఉత్సవాలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆదివారం పలు మండపాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, మరికొన్ని చోట్ల గణేష్ ప్రతిమల నిమజ్జన శోభాయాత్రలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో ఆయా మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. పలుచోట్ల ముస్లింలు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఉత్సవాలు మత సామరస్యానికి అద్దం పట్టాయి.

సంగారెడ్డి రూరల్/సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15: సంగారెడ్డిలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మత సామరస్యం వెల్లివిరిసింది. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాంతినగర్‌లో సూర్యవంశి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం మున్సిపల్ కౌన్సిపల్ సోహెబ్ అలీ తన సొంత నిధులతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, సూర్యవంశీ యూత్ సభ్యులు పాల్గొన్నారు. సంగారెడ్డి నేతాజీ నగర్‌లో హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద ఆదివారం హోమం నిర్వహించారు. హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

● కోహీర్: మండల కేంద్రంలోని పాండురంగ మందిరంలో సార్వజనిక గణేష్ మండలి వారు ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుని వద్ద కుంకుమార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

● కల్హేర్: మండల పరిధిలోని ఖానాపూర్(కె) గ్రామంలో సాగర్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాన్ని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యేలు ఎం. భూపాల్‌రెడ్డి, ఎం. విజయపాల్‌రెడ్డిలు ఆదివారం వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

● జహీరాబాద్: పట్టణంలోని పలు వినాయకమండపాలవద్ద క్విజ్ పోటీలను నిర్వహిస్తూ విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్నారు. పట్టణంలోని ఆర్యనగర్‌లో నిర్వహించిన రంగవల్లులు కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.ఈ పోటీల్లో విజేతలకు జిల్లా లింగాయత్ సమాజ్ నాయకురాలు మంజులాకౌశాస్ బహుమతులను అందజేశారు. అదేవిధంగా పట్టణంలోని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి, తదితరులు పట్టణంలోని నాగులకట్ట, హౌజింగ్‌బోర్డు, గడి, హమాలికాలనీ, శాంతినగర్ వార్డుల్లో వినాయక విగ్రహాలను దర్శించుకొని పూజలు చేశారు.

● మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని జీకేఆర్ గార్డెన్ వద్ద బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వినాయకుడికి పూజలు చేశారు. వీరహనుమాన్ కాలనీలో సామూహిక హోమాలు నిర్వహించగా మరకత శివలింగం, గణనాథుడు, నారాయణమూర్తి ఎతిమలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లిఖార్జున్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

●మనోహరాబాద్: మండలంలోని కోనాయపల్లి పిటి గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ భాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామా పంచాయితీ గణపతి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● చేగుంట: చేగుంట, నార్సింగి మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. చేగుంట మండల కేంద్రంతో పాటు మక్కరాజ్‌పేట, కర్నాల్‌పల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఊరేగింపుగా చెరువుల్లో నిమజ్జనం చేశారు.

● పెద్దశంకరంపేట: పట్టణంలోని తిరుమలాపూర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పేటలోని భజరంగ్‌దళ్, పూసలగల్లీ, శిశుమందిర్ వద్ద, కింది గల్లీ, పలు గ్రామాల్లో ప్రదర్శించిన వినాయక మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు.

● రేగోడు: రేగోడు నోబుల్ యూత్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వద్ద ప్రతిష్ఠించిన మట్టి గణపతిని ఆదివారం ఘనంగా నిమజ్జనం చేశారు. మర్పల్లిలో రెడ్డి కాలనీలో ని వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్యారారం గ్రామంలో మల్లికార్జున స్వామి కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడికి ఎస్ఐ పోచయ్య తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంతో పాటు జంగరాయి, గవ్వపల్లి, చందంపేట తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద భక్తులు పలు పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయకులను అలంకరించి ట్రాక్టర్లపై పెట్టి డప్పు చప్పుళ్ల మధ్య పుర వీధులలో ఘనంగా ఊరేగించి, గ్రామశివారు చెరువులలో నిమజ్జనం చేశారు. పలు వినాయక మంపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.

● నర్సాపూర్: పట్టణంలో ఆదివారం వినాయక ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో డప్పుచప్పుళ్లు, నృత్యాలు, టపాకాయలు కాలుస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జన ఏర్పాట్లను తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ జాన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ చెరువు పరిసరాలను పరిశీలించి సూచనలు చేశారు.

● మాసాయిపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మెదక్ మున్సిపాలిటీ: జీకేఆర్ గార్డెన్ వద్ద వినాయక పూజలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


పెద్దశంకరంపేట: తిరుమలాపూర్‌లో వినాయకుడికి సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న మహిళలు


నర్సాపూర్ రాయరావు చెరువులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం



చేగుంట: వినాయక మండపంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు